# పుత్తడి బొమ్మ పూర్ణమ్మ

## శ్రీ గురజాడ అప్పారావు గారు

జననం : సెప్టెంబరు 21, 1862
తలిదండ్రులు : కౌసల్యమ్మ, వేంకటరామదాసులు
జన్మస్థలం : విశాఖ జిల్లా యలమంచిలి తాలూకాలోని 'రాయవరం'

ఇక్కడ వివరించబడిన "పూర్ణమ్మ" గేయ కావ్యం - మహాకవి గురజాడ వారి "ముత్యాల సరాలు" అనే ఖండకావ్యం నుంచి తీసుకొనబడినది. ఎప్పుడో చదువుకున్న ఈ పూర్ణమ్మ కథ గురించి ఆలోచన పుట్టటానికి కారణం ఒక రకంగా నేను మా అమ్మమ్మగారి ఊర్లో మా చిన్నప్పుడు చెప్పుకున్న ఒకానొక కథ ఒక సాయంత్రం పూట నాకు గుర్తుకు రావటమే. నేను విన్న కథలోని పాత్రలు, వాటి పేర్లు ఇప్పుడు అప్రస్తుతం ..కాని ఈ పూర్ణమ్మ కథ చదివితే ఆ రోజుల్లో డబ్బుకి కక్కుర్తి పడి ముక్కుపచ్చలారని బంగారు బొమ్మలవంటి ముద్దు బిడ్డల్ని బాల్యం తీరక ముందే వృద్ధుల చరమజీవితానికి బలి చేసి ఎలా ఆ ఆడబిడ్డల జీవితాన్ని విషాదాంతం చేసేవారో, ఈ పూర్ణమ్మ రచన తెలియచేస్తుంది...

సంక్షిప్తంగా ఈ గేయ కావ్యకథ ఇలా ఉంటుంది...

పూర్ణమ్మ ఒక పూజారి కూతురు. చిన్నతనమునుంచి దుర్గాదేవికి పరమభక్తురాలు. కాసులకోసం ఆమె తలిదండ్రులు ఆ బాలికను ఒక ముదుసలికి ఇచ్చి పెళ్ళి చేస్తారు. తన మగడు ముసలివాడు అని తెలిసి, తోటి వారు "తాత తాత" అని గేలిచేస్తూ ఉంటే ఏమీ చెయ్యలేక దుర్గమ్మ వద్దకు వెళ్ళి దుఃఖిస్తూ ఉండేది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

కొన్నాళ్ళకు భర్త తనను తీసుకొనిపోవుటకు రాగా అందరి వద్దా వీడ్కోలు తీస్కుని, ఎప్పటిలాగే సాయంత్రం దుర్గాదేవి ఆలయానికి వెళ్ళిన పూర్ణమ్మ తిరిగి రాదు. వెళ్ళి చూడగా, పూర్ణమ్మ ధరించిన ఆభరణాలు దుర్గాదేవికి అలంకరింపబడి ఉంటాయి.

చాలా అద్భుతమయిన కరుణార్ద్ర రసం నిండి ఉంటుంది ఈ గేయ కావ్యంలో. పైగా మహాకవి గురజాడ వారి కలం నుంచి జారువ్రాలిన ముత్యాలలో ఇది ఒకటి. ఇక చెప్పేది ఏముంది.. మీరే చదువుకోండి



PDF created with pdfFactory trial version www.pdffactory.com



Vamsi M Maganti www.maganti.org contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com

గురజాడ అప్పారావు

# పూర్ణమ్మ

మేలిమి బంగరు మెలతల్లారా!
కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లులగన్నా పిల్లల్లారా!
    విన్నారమ్మా యీ కథను.

ఆటల పాటల పేటికలారా!
కమ్మని మాటల కొమ్మల్లారా!
అమ్మలగన్నా అమ్మల్లారా!
    వినరమ్మా మీరీకథను.

కొండల నడుమను కోనొకటున్నది;
కోనకి నడుమా కొలనొకటుంది;
కొలని గట్టునా కోవెల లోపల;
    వెలసెను బంగరు దుర్గమ్మ.

పూజారింటను పుట్టెను చిన్నది
పుత్తడి బొమ్మా పూర్ణమ్మా;
అన్నల తమ్ముల కనుగై దుర్గకు
    పూజకు పువ్వులు కోసేది.

ఏయే వేళల పూచే పువ్వుల
ఆ యా వేళల అందించి
బంగరు దుర్గను భక్తితొ కొలిచెను
    పుత్తడి బొమ్మా పూర్ణమ్మ.

PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఏ యే ఋతువుల పండే పళ్ళను
ఆ యా ఋతువుల అందించి
బంగరు దుర్గను భక్తితో కొలిచెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మ.

పళ్ళను మీరిన తీపుల నడలును
పువ్వుల మీరిన పోడుములున్
అంగము లందున అమరెను పూర్ణకు
సౌరులు మించెను నానాటన్.

కాసుకు లోనై తల్లీతండ్రీ
నెనరూ న్యాయం విడనాడి
పుత్తడి బొమ్మను పూర్ణమ్మను వొక
ముదుసలి మొగనుకు ముడి వేసిరి.

ఆమని రాగా దుర్గ కొలనులో
కలకల నవ్వెను తామరలు
ఆమని రాగా దుర్గవనములో
కిల కిల పలికెను కీరములు.

ముద్దు నగవులూ ముచ్చటలు మరి
పెనిమిటి గాంచిన నిమిషమున
జారెను కన్నియ ముఖకమలమ్మున
కన్నుల గ్రమ్మెను కన్నీరు.

ఆటలపాటల తోటి కన్నియలు
మొగుడు తాత యని గేలింప,
ఆటల పాటల కలియక పూర్ణమ
దుర్గను చేరీ దుఃఖించె.

కొన్నాళ్ళకు పతి కొని పోవచ్చెను
పుత్తడి బొమ్మను పూర్ణమను;

PDF created with pdfFactory trial version www.pdffactory.com

చీరెలు సొమ్ములు చాలగ దెచ్చెను
    పుత్తడి బొమ్మకు పూర్ణమకు.

పసుపు రాసిరి బంగరు మేనికి
జలకము లాడెను పూర్ణమ్మ;
వదినెలు పూర్ణకు పరి పరి విధముల
    నేర్పులు మెరసీ తై చేసి.

పెద్దల కప్పుడు మొక్కెను పూర్ణమ
తల్లీ తండ్రీ దీవించ్రి;
దీవన వింటూ పక్కున నవ్వెను
    పుత్తడి బొమ్మా పూర్ణమ్మ

చిన్నల నందర కౌగిట చేర్చుకు
కంటను పెట్టెను కన్నీరూ;
అన్నల తమ్ముల కప్పుడు పలికెను
    పుత్తడి బొమ్మా పూర్ణమ్మ.

"అన్నల్లారా తమ్ముల్లారా!
అమ్మను అయ్యను కానండీ!
బంగరు దుర్గను భక్తితొ కొలవం
    డమ్మల కమ్మా దుర్గమ్మ.

ఆ యా వేళల పూచే పువ్వుల
ఆ యా ఋతువుల పళ్ళన్ని,
భక్తిని గోసి శక్తికి యివ్వం
    డమ్మల కమ్మా దుర్గమ్మ.

నలుగురు కూచుని నవ్వేవేళల

PDF created with pdfFactory trial version www.pdffactory.com

బిల బిల కన్నుల కన్నీ రొలికెను
పుత్తడి బొమ్మకు పూర్ణమకు
కన్నులు తుడుచుకు కలకల నవ్వెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మా.

వగచిరి వదినెలు, వగచిరి తమ్ములు
తల్లియు కంటను తడిపెట్టెన్.
కాసుకు లోనై అల్లుని తలచుచు
ఆనందించెను అయ్యొకడె.

యెప్పటి యట్టుల సాయంత్రమ్మున
యేరిన పువ్వుల సరిగూర్చి
సంతోషమ్మున దుర్గను కొలువను
వొంటిగ బోయెను పూర్ణమ్మ.

ఆవులు పెయ్యలు మందల జేరెను
పిట్టలు చెట్లను గుమిగూడెన్
మింటను చుక్కలు మెరయుచు పొడమెను
పూర్ణమ యింటికి రా దాయె.

చీకటి నిండెను కొండల కోనల
మేతకు మెకములు మసల జనెన్
దుర్గకు మెడలో హారము లమరెను
పూర్ణమ యింటికి రా దాయె.

కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి జేరెను మేని పసల్!
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ.

PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఏదన్నా తప్పులు ఉంటే సహృదయంతో సరిదిద్దమని విన్నపము.

Keywords: gurajada, apparao, puttadi, bomma, poornamma

Vamsi M Maganti www.maganti.org contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com